సాక్షి చిత్తూరు

సోమవారం । 5 । జూన్ । 2023



పర్యావరణ హితం..
వరదయ్యపాళెం మండలంలోని శ్రీసిటీ భారీ పరిశ్రమలతోపాటు పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులు వేస్తోంది. –8లో



బోయకొండ కిటకిట
జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. –8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	39	27
తిరుపతి	41	28
తిరుమల	36	23
గూడూరు	42	29
నగరి	41	28

న్యూస్‌రీల్

అలరించిన దుర్యోధన వధ



నాటకంలోని యుద్ధ సన్నివేశం

వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధతో ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తదుపరి భాగవతారిణి హరికథ కాలక్షేపం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. ముందుగా గంగమడుగులో దాక్కొని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు లాక్కొచ్చి చేసే యుద్ధ సన్నివేశం ఆహూతులను అలరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధనుడి ప్రతిమ వద్ద సాగిన భీమ, దుర్యోధన వేషధారుల భీకర పోరు భక్తులను కట్టిపడేసింది. ఇద్దరి మధ్య వీరోచితంగా సాగిన ఈ యుద్ధంలో దుర్యోధనుడు తనువు చాలించాడు. కళాకారులు చేసిన నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. తదుపరి ధర్మరాజుల పట్టాభిషేకం జరిగింది. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు కంకణధారులై ఉపవాసాలతో అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ స్పందనకు ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

మెటల్ డిటెక్టర్ ప్రారంభం



మెటల్ డిటెక్టర్‌ను ప్రారంభిస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి మెటల్ డిటెక్టర్‌ను ప్రారంభించారు. ఆలయంలో భద్రతా చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొన్నారు. కార్యక్రమంలో ఈఓ చంద్రమౌళి, నేతలు లడ్డూరమణ, సురేంద్రరెడ్డి, గంగిరెడ్డి,నవీన్‌రెడ్డి తదితరులున్నారు.

పచ్చదనం పరిరక్షణకు కృషి చేద్దాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ శ్రీనివాసులు

సాక్షి, చిత్తూరు: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. జాయింట్ కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్టా చట్టం కింద చెట్లను నరికితే వారి నుంచి రూ. 50వేల జరిమానా వసూలు చేస్తామన్నారు. పచ్చదనం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామన్నారు. సీపీఐ చాప్టర్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ, ప్రతి పౌరుడు తన జీవితంలో నాలుగు చెట్లను పెంచవలసిన ఆవశ్యకత ఉందన్నారు. చెట్లను నరకడం వల్లనే అధిక ఉష్ణోగ్రతలతో బాధ పడుతున్నామన్నారు. సీపీఐ ఏపీ చాప్టర్ వారు రూపొందించిన గోడ పత్రికను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మక్కెన అచ్చయ్య, లక్ష్మి చెన్నకేశవరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలోని ఇంట్లో నివాసముంటున్న మహిళ



నాగరాజకుప్పం వద్ద జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు



ఇదే మా చిరునామా!

రెండు మూడేళ్లకోసారి తక్కువ అద్దెకు దొరికే ఇంటికోసం వెదికి, అక్కడి యజమానుల వేధింపులు భరిస్తూ అవమానాలు ఎదుర్కొన్న వారికి ఇప్పుడు ఉపశమనం లభిస్తోంది. దశాబ్దాల పాటు సొంతిల్లు లేక అద్దెంటి అడ్రసులు మార్చుకోలేని పేదలకు ఇప్పుడు శాశ్వత చిరునామా దొరికింది. జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు చేసిన వారు 'ఇదే మా చిరునామా' అంటూ సంతోషంగా చెబుతున్నారు. సెంటు ఇల్లే అయినా సొంతింటి కల సాకారమైందని సంబరపడిపోతున్నారు.

- సొంతింటి కల సాకారం
- పేదల పక్షాన నిలబడిన ప్రభుత్వం
- జిల్లా స్థాయిలో నగరి అగ్రస్థానం

నగరి : ఏళ్లకు ఏళ్లు అలుముకున్న చీకటి ఇప్పుడు అక్కడ తొలగిపోయింది. ఇన్నాళ్లు రాజ్యమేలిన నిశ్శబ్దం పటాపంచలైంది. పట్టణ శివారుల్లో ఉన్న ఆ ప్రదేశంలో కొత్త ఊరు ఆవిర్భవించింది. ఒకప్పుడు జనసంచారం లేని ప్రాంతం ఈ రోజు 1074 కుటుంబాలకు ఆవాసమైంది. పేదల కోసం ప్రస్తుత ప్రభుత్వం నగరి మున్సిపాలిటీ నాగరాజకుప్పం మార్గంలో వేసిన లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు కాంట్రాక్టు పద్ధతిలో శరవేగంగా పూర్తిచేసుకుంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా 73,586 ఇళ్లు మంజూరు చేయగా వాటిలో 66,826 నిర్మాణాలు ప్రారంభించారు. ఇప్పటికి 32,077 పూర్తికాగా 34,779 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. నగరి నియోజకవర్గంలో 5,195 ఇళ్లు కేటాయించగా వాటిలో 4,942 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వీటిలో 2001 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా నిర్మాణాలు చేపట్టడంలో నియోజకవర్గం 3వ స్థానంలో నిలిచింది. వీటిలో నాగరాజుకుప్పం మార్గంలో కేటాయించిన నివాసాలు పట్టణ శివారుల్లో ఉండటం, నిర్మాణ ప్రక్రియలో పలువురికి అనుభవం లేక సంశయిస్తూ ఉండడంతో మంత్రి ఆర్కేరోజా చొరవ తీసుకొని కాంట్రాక్టు పద్ధతిలో ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందజేసే ఏర్పాట్లు చేశారు. ఇలా కాంట్రాక్టు పద్ధతిలో నిర్మించి ఇవ్వడంలో జిల్లా స్థాయిలో నగరి ప్రథమ స్థానంలో నిలిచింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో 411 నిర్మాణాలు పూర్తికాగా మరో 300 గృహాలు పూర్తి కావస్తున్నాయి. 20 కుటుంబాల వారు గృహ ప్రవేశం చేసి నివాసం ఉంటున్నారు. ×ఇది మా ఇల్లు₹ అని సంతోషంగా అందరికీ చెప్పుకుంటున్నారు. బతుకంతా అద్దెలు కడుతూ, ఇళ్లు మారుతూ అవస్థలు పడిన పేదలు ఇప్పుడు సొంతింటిలో ప్రశాంతంగా నిద్రపోతున్నారు. సొంత చిరునామా లేక తరతరాలుగా గడిపిన వారు ఇప్పుడు తమ పేరుతో గర్వంగా చెప్పగలుగుతున్నారు. సెంటు భూమి కొని అందులో ఇల్లు కట్టుకోవడం సామాన్యుడికి దాదాపు అసాధ్యమైన పని. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవ, మంత్రి ఆర్కేరోజా సహకారంతో అసాధ్యం సుసాధ్యమైంది. ఇళ్లనిర్మాణాలు కాంట్రాక్టు పద్ధతిన చేపట్టడంతో నిర్మాణాలు వేగంగా పరుగులు తీశాయి. ఇప్పటికే నాగరాజకుప్పం లేఅవుట్‌లో కొత్తగా లైట్లు వేశారు. గ్రావెల్ రోడ్లు వేశారు. నిర్మాణాలు ఎక్కువగా పూర్తయిన ప్రాంతంలో సిమెంటు రోడ్డు వేశారు. అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండడంతో గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేసేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

రహదారి పక్కనే ఊరు

నాగరాజకుప్పం మార్గంలో ఇంటి స్థలాలు కేటాయించిన సమయంలో అది ఒక శివారు ప్రాంతం. అయితే నేడు ఆ ప్రాంతానికి కూతవేటు దూరంలోనే చిత్తూరు, తచ్చూరు జాతీయ రహదారి ఏర్పడింది. దీంతో ఈ ప్రాంతం జాతీయ రహదారికి సమీపమైంది. తొలుత కాస్త సంశయించిన లబ్ధిదారులు నేడు ఆసక్తితో ముందుకు వచ్చి నిర్మించుకుంటున్నారు.



జగనన్న కాలనీ సమీపంలో నిర్మిస్తున్న జాతీయ రహదారి



నివాసాల మధ్యలో ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్లు

ఇప్పుడు నాకూ ఇల్లుంది



నా వివాహ జీవితం ప్రారంభమైన నాటి నుంచి అద్దె ఇంటిలోనే ఉన్నా. రూ.150 నుంచి రూ.5,500 అద్దె చెల్లించాం. నా భర్త రోజు కూలీ మాకు సొంతిల్లు అన్నది కలగానే ఉండేది. జగనన్న చలవతో నాకు పట్టా ఇచ్చి స్థలం ఇచ్చారు. మంత్రి ఆర్కేరోజా సహకారంతో కాంట్రాక్టర్ల ద్వారా ఇల్లు నిర్మించుకున్నాను. ప్రస్తుతం ఆ ఇంటిలోనే కాపురం ఉన్నాం. నేడు నాకు సొంతంగా ఇల్లుంది అన్న భరోసా వచ్చింది.

– జి. శాంతి, నగరి

ఈ మేలు మరువలేం



నా భర్త నేత కార్మికుడు. నాలుగు దశాబ్దాలుగా అద్దె ఇంటిలోనే ఉన్నాం. స్థిరమైన చిరునామా లేక ఎక్కడ మాకు తక్కువ అద్దెకు ఇల్లు దొరుకుతుందో అక్కడ నివాసం ఉంటూ వస్తున్నాం. ప్రస్తుతం జగనన్న స్థలం ఇచ్చి పట్టా ఇచ్చారు. మంత్రి ఆర్కేరోజా మాపై శ్రద్ధ చూపి నిర్మాణాలు కూడా కాంట్రాక్టు పద్ధతిన చేయించి ఇస్తున్నారు. నేడు మాకంటూ సొంతిల్లు ఉంది. ఈ మేలు మరువలేనిది.

– రాజేశ్వరి, కొత్తపేట

నిర్మాణాలు వేగంగా చేయిస్తున్నాం



నాగరాజకుప్పం వద్ద పెద్ద ఎత్తున 1074 ఇళ్ల నిర్మాణాలు బిల్డర్స్‌కు అప్పగించాం. వారు మంత్రి ఆదేశాలతో నిర్మాణాలు వేగంగా చేపడుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు పలుమార్లు ఈ నిర్మాణాలు పరిశీలించారు. జిల్లా స్థాయిలో బిల్డర్స్ ద్వారా చేపట్టిన నిర్మాణాల్లో నగరి ముందంజలో ఉంది. ఇతర లేఅవుట్లలో నిర్మాణాలు ప్రారంభించని వారిని కూడా ప్రోత్సహించి నిర్మాణాలు చేయిస్తున్నాం.

– వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి

తెప్పోత్సవం..పరిపూర్ణం





తిరుచానూరు పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తున్న పద్మావతి అమ్మవారు, గరుడ వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తున్న అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఐదు రోజులుగా నిర్వహించిన ఈ వార్షిక తెప్పోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఉదయం అమ్మవారి మూలవర్లకు అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం పుష్కరిణి మధ్యలోని నీరాడ మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం పద్మావతి అమ్మవారు తెప్పపై పుష్కరిణిలో ఏడు పర్యాయాలు విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు.

నేత్రపర్వంగా గరుడ సేవ

తెప్పోత్సవంలో చివరి రోజు తెప్పోత్సవం అనంతరం అమ్మవారిని గంగుంద్ర మండపానికి తీసుకొచ్చి అక్కడ సిద్ధంగా ఉంచిన గరుడ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం దివ్యాలంకార శోభితురాలైన శ్రీవారి దేవేరి శ్రీ పద్మావతి అమ్మవారు గరుడ వాహనంపై ఆశీనులై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, పేష్కార్ రమేష్, సూపరింటెండెంట్లు శేషగిరి, మధు, ఆర్జితం, వాహన ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాష్ పాల్గొన్నారు. సోమవారం నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభంకానున్నట్లు డెప్యూటీ ఈవో గోవిందరాజన్ తెలిపారు.

గరుడునిపై గోవిందుడి అభయం

వడమాలపేట : మండలంలోని అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవరోజు ప్రసన్న వేంకటేశ్వరస్వామి గరుడవాహనంపై విహరించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి విశ్వరూప దర్శనం, శుద్ధి, కొలువు, తోమాలసేవ, అర్చన, మొదటిగంట నిర్వహించారు. శ్రీవారిని వాహన మండపంలోకి వేంచేపు చేశారు. స్వామి వారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తిని పల్లకీపై మోహినీ అవతారంలో కొలువుదీర్చి వేదోక్తంగా దీపధూపనైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి వారు మాడవీధుల్లో పల్లకీపై ఊరేగారు. సాయంత్రం శుద్ధి, రాత్రి కైంకర్యములు నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి నుండి 6 వరకు ఊంజల్‌సేవ వేడుకగా నిర్వహించారు. అనంతరం శ్రీవారిని వాహనమండపంలోకి వేంచేపు చేసి సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి గరుడ సేవ ఆరంభమైంది. గరుడ వాహనంపై గోవిందుడు ఊరేగుతుంటే భక్తుల గోవింద నామస్మరణతో మాడవీధులు మారుమ్రోగాయి. వాహన సేవ అనంతరం స్వామి వారికి సల్లింపు కార్యక్రమం నిర్వహించి, ఏకాంత సేవ నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరులు రాంప్రసాద్‌రెడ్డి, లక్ష్మి దంపతులు గరుడ వాహన సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టెంపుల్ సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు సూర్యకుమారాచ్చార్యులు, తిప్పాచ్చార్యులు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందుడు

నేటి నుంచి అతిసార నియంత్రణ పక్షోత్సవాలు

చిత్తూరు రూరల్: నేటినుంచి జిల్లా వ్యాప్తంగా అతిసార నియంత్రణ పక్షోత్సవాలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 5 నుంచి 17వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఆశా కార్యకర్త తనపరిధిలోని ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా ఓఆర్ఎస్ జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. డయేరియా కేసులను గుర్తించి 14 రోజులపాటు జింక్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పక్షోత్సవాల ముఖ్య లక్ష్యాలను తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. డయేరియా వల్లే ప్రమాద సూచికలను వివరించాలని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ అయ్యంరెడ్డిపల్లెలోని టీడీపీకి చెందిన 20 కుటుంబాలు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మెచ్చి వైఎస్సార్‌సీపీలో చేరామని తెలిపారు. చంద్రబాబు తప్పుడు హామీలను జనం నమ్మరాదని సూచించారు. పార్టీలో చేరిన వారిలో సుబ్రమణ్యం, గురుస్వామి, నటరాజ, చంద్రప్ప, రఘు, రాజేంద్ర, ప్రవీణ్, వెంకటరామయ్య, సుబ్బయ్య, వెంకటేష్, మనోహర్, చంద్రప్ప,శివ, మణి,నాగరాజ, చిట్టి, చంద్రప్ప, నారాయణ, రాఘువేంద్ర తదితర కుటుంబాలున్నాయి. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చెంగారెడ్డి, రాజారెడ్డి, సర్పంచ్ గోవిందుస్వామి, మనోజ్ రెడ్డి, నరసింహారెడ్డి తదితరులున్నారు.

కాణిపాకంలో కొనసాగుతున్న రద్దీ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో క్యూలు, కంపార్ట్‌మెంట్‌లు భక్తులతో నిండిపోయాయి. వేసవిలో ఎండను కూడా లెక్క చేయకుండా భక్తులుబారులు తీరారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, అధికారులు తగు చర్యలు తీసుకొని స్వామి దర్శనం కల్పించారు. క్యూలలో ఫ్యాన్‌లు తిరుగుతున్నాయా లేదా, ఎప్పటికప్పుడు తాగునీరు, మజ్జిగ అందిస్తున్నారా లేదా అని చైర్మన్ పరిశీలించారు.

వేడుకగా హరి భజన కీర్తనలు

వినాయక స్వామి ఆస్థాన మండపంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర సమాజం తరపున హరి కీర్తన భజనలు వేడుకగా నిర్వహించారు. ధర్మపథం కార్యక్రమంలో ఆదివారం స్వామివారి ఆస్థాన మండపంలో పొద్దుటూరుకు చెందిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర సమాజం వారు మేళ తాళాలతో హరి భజన కీర్తనలు వేడుక గా నిర్వహించారు. భక్తులు సైతం స్వామివారి కీర్తన లు ఆలకించారు. హరి కీర్తనలు ఆలపించిన గాయకులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.





భక్తులతో కిక్కిరిసిన క్యూలు, ఆస్థాన మండపంలో హరికీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం

వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయం వరదరాజుల స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి పుర వీధుల్లో స్వామివారు గరుడ వాహనంపై విహరించారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజుల స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారిని సత్యనారాయణ స్వామిగా అలంకరించి శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. రాత్రి స్వామివారు గరుడవాహనంపై పుర వీధుల్లో విహరించగా భక్తులు స్వామివారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చక వేదపండితులు పాల్గొన్నారు.



సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

రాహుకేతు మండపాల తనిఖీ



పూజలను పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రాహుకేతు మండపాలను ఆదివారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న సదుపాయాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులు సంతృప్తి చెందే విధంగా పూజలు నిర్వహించాలని పూజారులకు సూచించారు. ఆలయంలోకి దళారీలు రాకుండా కట్టడి చేశారు. అడ్డదారిలో వెళ్లేవారిని నియంత్రించారు. ఆయన వెంట ఆలయ అధికారులు ఉన్నారు.

ఘనంగా అర్జున తపస్సు



తపస్సు మానుపై అర్జున వేషధారి

పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ పోలిశెట్టివారిపల్లె భారతం మిట్ట వద్ద ఆదివారం సాయంత్రం అర్జున తపస్సును ఘనంగా నిర్వహించారు. అర్జునుడిగా జనార్ధన్, శివుడిగా చెన్నకృష్ణ, పార్వతీదేవిగా రమేష్ వేషాలను ధరించి ఆకట్టుకున్నారు. అర్జున వేషధారి తపస్సు మానును అధిరోహించి అరటి, నిమ్మ, విబూది పండ్లు విసిరారు. పెద్ద సంఖ్యలో భక్తులు వీటిని అందుకునేందుకు పోటీపడ్డారు.

పర్యావరణహితం.. శ్రీసిటీ సొంతం

- పరిశ్రమలే కాదు పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులు వేస్తున్న శ్రీసిటీ
- పచ్చదనం, పరిశుభ్రతకు పెద్దపీట
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



శ్రీసిటీలో మురుగునీరు శుద్ధి చేసే ప్లాంట్

వరదయ్యపాళెం: శ్రీసిటీ.. భారీ పరిశ్రమలే కాదు.. అక్కడ వాతావరణం కూడా సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఇప్పటికే స్మార్ట్ సిటీ, గ్రీన్ సిటీగా పిలవబడుతున్న ఈ ఏకీకృత పారిశ్రామిక నగరం నేడు పర్యావరణహిత సిటీగా కూడా మారిందనడంలో అతియోశక్తి లేదు. పర్యావరణ హిత చర్యల్లోనూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. కాలుష్య నివారణతో పాటు పచ్చదనం, పరిశుభ్రత, నీటి సంరక్షణ ఇతర పలు పర్యావరణ ప్రమాణాల పెంపు కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. అవేంటో ఒక లుక్కేయండి.

సోలార్‌పవర్ : విద్యుత్‌శక్తి అవసరాలను తీర్చడానికి 10 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని అతిపెద్ద సౌర విద్యుత్ ప్లాంట్లలో ఒకటి. కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడే స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. శ్రీసిటీ కార్యాలయాలకు, వీధి దీపాలకు, మరిన్ని అవసరాలకు దీన్ని వినియోగిస్తున్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ : శ్రీసిటీలో మురుగునీరు, ఇతర వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. మురుగునీటిని శుద్ధి చేసి చెట్ల పెంపకం, ఇతర అవసరాలకు వాడుతారు. చెత్తాచెదారం, బయోడిగ్రేడిబుల్ వ్యర్థాలను శుద్ధి చేసి చెట్లకు ఎరువులుగా, మిగులు ఆహార పదార్థాలను బయో మెథనేషన్ యంత్రం ద్వారా వంట గ్యాస్‌గా తయారు చేసి స్థానిక అవసరాలకు వినియోగిస్తున్నారు. శ్రీసిటీలో, పరిసర ప్రాంతాల్లో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

నీటిసంరక్షణ : శ్రీసిటీలో నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా వర్షపునీరు నిల్వ చేసేందుకు కిలోమీటర్ల పొడవునా, కాలువలు, రిజర్వాయర్లు నిర్మించారు. నీటిని శుద్ధి చేసి పునర్వినియోగం చేస్తూ సమగ్ర నీటి సంరక్షణ చర్యలను అమలుచేస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ఇక్కడ నీటి వినియోగం తగ్గి భూగర్భస్థాయి పెరిగింది.

గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ : శ్రీసిటీ క్యాంపస్‌చుట్టూ గ్రీన్ బెల్ట్‌ను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నారు. దీని వలన స్వచ్ఛమైన గాలి అందుతూ ఆహ్లాదకరమైన వాతావరణం చోటుచేసుకుంది. ఇప్పటి వరకు 10 లక్షలకు పైగా చెట్లను నాటడం పూర్తి చేయగా మొత్తం 50 లక్షలచెట్లను నాటడం లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఏటా ప ర్యావరణం దినోత్సవం సందర్భంగా శ్రీసిటీ పరిసరాలు పరిశ్రమల ఆవరణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్ర మం నిర్వహిస్తారు. అలాగే శ్రీసిటీ తనఉద్యోగుల కోసం పబ్లి క్ ట్రాన్స్‌పోర్టు సైకిలింగ్ వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది.

సామాజిక బాధ్యత : సామాజిక బాధ్యతగా తమ ఉద్యోగులు, ఇతర పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం పలు సామాజిక బాధ్యతల చర్యల అమలుకు శ్రీసిటీ కట్టుబడి ఉంది. ఈ ప్రాంతంలో విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరచడం.. స్థానిక వ్యాపారాలకు మద్దతు ఇవ్వడం, ఇతర కమ్యూనిటీ అభివృద్ధి కార్యకలాపాలకు పెద్దపీట వేస్తోంది. శ్రీసిటీ సుస్థిర పర్యావరణహిత కార్యక్రమాలు, ఇక్కడ వ్యాపార అనుకూల వాతావరణాన్ని మరింత ప్రోత్సహిస్తోంది. శ్రీసిటీలో వినూత్న వ్యర్థాల నిర్వహణ, వ్యవస్థలు, నీటి నిర్వహణ చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, ఇతర పారిశ్రామిక పార్కులు అనుసరించడానికి ఇది ఒక్క చక్కని ఉదాహరణగా మారుతోంది. శ్రీసిటీ పర్యావరణ హిత చర్యలకు గుర్తింపుగా ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ)కి చెందిన ప్రతిష్టాత్మక గ్రీన్ సిటీ గోల్డ్ రేటింగ్ అవార్డు శ్రీసిటికీ తగ్గింది. అలాగే నీటి పొదుపు, సంరక్షణ చర్యలకు గాను 2021లో సీఐఐ నేషన్ వాటర్ అవార్డు శ్రీసిటీని వరించింది.



వర్షపునీరు నిల్వ చేసే జలాశయం



ఆర్గానిక్ వేస్ట్ నుంచి బయోగ్యాస్ తయారు చేసే ప్లాంట్



ఎలక్ట్రికల్ ఆటో



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

బార్బర్ బంకు కూల్చివేత



వెదురుకుప్పం: జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న బార్బర్ బంకును గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేసినట్లు మండలంలోని దేవళంపేటకు చెందిన చరణ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఆదివారం ఎస్ఐ లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. దేవళంపేట–తిరుపతి ప్రధాన రహదారి పక్కన రెండు రోజుల క్రితం చిన్నపాటి బంకును ఏర్పాటు చేసుకునేందుకు దిమ్మెలు నిర్మించారు. అయితే ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు తాము లేని సమయంలో చొరబడి దిమ్మెలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. సుమారు రూ.30 వేలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన దిమ్మెలను ధ్వంసం చేయడమే కాకుండా స్థానికంగా తమను బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ట్రక్కు ఢీకొని యువకుడి మృతి

చిల్లకూరు : మండలంలోని రామారెడ్డిపాళెం సమీపంలో ఆదివారం ట్రక్కు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. తూర్పుకనుపూరు గ్రామానికి చెందిన గుడి వెంకటేశ్వర్లు (22) బైక్‌పై గూడూరుకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న క్యాటరింగ్ ట్రక్కు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును 108లో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అట్టహాసంగా మారథాన్

నాయుడుపేటటౌన్: నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం సమీపంలో ఆదివారం మారథాన్ పరుగు పందెం పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు ప్రాంతాలకు చెందిన సుమారు 500 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఎస్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు, జాతీయ పారా అథ్లెటిక్ మోమిడి లక్ష్మయ్య, కమిటీ సభ్యుల సారథ్యంలో10, 14,18 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలకు 3, 4, 5 కిలోమీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, చల్లా వినూప్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.

రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసం

పలమనేరు: రైల్వేలో ఉద్యోగాలిపిస్తామంటూ పలువురు నిరుద్యోగుల వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేసిన నకిలీ ఉద్యోగిపై బాధితులు స్థానిక పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు మండలంలోని మండిపేటకోటూరు గ్రామానికి చెందిన కార్తీక్ తాను రైల్వేలో ఉద్యోగినంటూ గ్రామస్తులను ఏమార్చి పలువురికి ఉద్యోగాలిప్పిస్తానంటూ వేలల్లో డబ్బులు వసూలు చేసి కనిపించకుండా పోయాడు. దీంతో బాధితులు కార్తీక్ సెల్‌కు ఫోన్ చేయగా పనిచేయలేదు. అనుమానం వచ్చి విచారించడంతో అతనో మోసగాడని తెలిసింది. దీంతో తమకు న్యాయం చేయాలంటూ స్థానిక సీఐ చంద్రశేఖర్‌కు పిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

తవణంపల్లె 'మార్ట్' సరికొత్త రికార్డు



జ్ఞాపిక అందుకుంటున్న అధ్యక్షురాలు జయలలిత

తవణంపల్లె: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న తవణంపల్లె చేయూత మహిళా మార్ట్ అనతి కాలంలో రూ.కోటి మైలు రాయి దాటి జిల్లా స్థాయిలో సరికొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్రంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 31 మార్ట్‌లు నడుస్తుండగా జిల్లాలో తవణంపల్లె, పెనుమూరు మండలాల్లో ఏర్పాటు చేశారు. ఇందులో 76 రోజుల్లో రూ.కోటి లావాదేవీలు జరిపించి మైలురాయి దాటిన తవణంపల్లె మహిళా మార్ట్ రాష్ట్ర, జిల్లా స్థాయిలో సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలో డీఆర్‌డీఏ పీడీ ద్వారా తవణంపల్లె మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జయలలితను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



సదుం: ఊట ధ్వంసం చేస్తున్న ఎస్ఐ మారుతి, సిబ్బంది

సదుం: మండలంలోని రెడ్డివారిపల్లె సమీపంలో సారా తయారీపై సమాచారం రావడంతో ఆదివారం దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ మారుతి తెలిపారు. రెండు ప్రదేశాల్లో నిర్వహించిన దాడుల్లో తయారీకి సిద్ధం చేసిన 900 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి, 18 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అదే గ్రామానికి చెందిన భరత్, సుబ్రమణ్యం నిందితులుగా గుర్తించారు. వారు పరారీలో ఉండడంతో వారిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కిటకిటలాడిన బోయకొండ



బోయకొండ: మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. సెలవు రోజు కావడంతో బోయకొండ గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీతో ఒక్కసారిగా పెరిగింది. క్యూలు కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఆలయ ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సీఐ మధుసూదనరెడ్డి, ఎస్ఐ రవికుమార్ బందోబస్తు నిర్వహించారు.

విశ్వమోహనం.. విమానోత్సవం



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న వేద పండితులు



ఊరేగుతున్న దేవదేవేరులు

నాయుడుపేటటౌన్ : మండలంలోని తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామివారి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి విమానోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రధానార్చకుడు శేషాద్రిస్వామి ఆధ్వర్యంలో టీటీడీ వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి తిరుచ్చి ఉత్సవాన్ని జరిపించారు. మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేపట్టారు. రాత్రి ఊంజల్ సేవ, ఏకాంత సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి, గ్రామపెద్దలు కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, నరసారెడ్డి, పసల గంగాప్రసాద్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం : బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం సింహ, గజవాహన సేవలు జరిపించనున్నట్లు వెల్లడించారు.

చెంగాళమ్మ ఆలయంలో అఖండజ్యోతి



అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో అఖండజ్యోతికి పూజలు చేస్తున్న అర్చకులు

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అఖండజ్యోతిని వెలిగించారు. ముందుగా అఖండజ్యోతికి వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం ఆలయంలోని పరివార దేవతలకు చూపించి హారతులిచ్చారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎం పద్మజ, బీ.సునీత, ఎస్.నాగమణి, పీ.మారెమ్మ పాల్గొన్నారు.

ఘనంగా చండీయాగం : అమ్మవారి ఆలయం ఆవరణంలోని యాగశాలలో జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా మహాచండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయుడుపేటకు చెందిన ఓడూరు మునికృష్ణారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ శ్రీహరిహరనాథ శర్మ చెంగాళమ్మ ఆలయానికి విచ్చేయగా.. చైర్మన్ బాలచంద్రారెడ్డి, ఈఓ శ్రీనివాసులురెడ్డి సాదరంగా స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

తెప్పోత్సవ బోట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కిలివేటి

కాళంగినదిలో బోట్‌షికార్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. భక్తులకు కాసేపు సేద తీరడానికి ప్రత్యేకంగా కాళంగినదిలో బోట్ షికార్ ఏర్పాటు చేశారు. ఈ బోట్లను లాంఛనంగా ప్రారంభించిన నేతలు, అధికారులు కాసేపు బోట్ షికార్ చేశారు.